
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శనివారం 15 నవంబరు 2025

యువతరంతోనే నవ సమాజ నిర్మాణం

- పటేల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- సామాజిక స్పృహ అలవర్చుకోవాలి
- మెదక్ ఎంపీ రఘునందన్

6

సత్వర పరిష్కార వేదిక

- లోక్ అదాలత్ కక్షిదారులకు ఎంతో మేలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గం ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంగా జాతీయ లోక్ అదాలత్‌లు కొనసాగుతున్నాయి. 1987 చట్టం ప్రకారం లోక్ అదాలత్ న్యాయ సేవాధికార చట్టబద్ధమైన సంస్థ. పెండింగ్‌లో ఉన్న కేసులు, న్యాయస్థానంలో ప్రీలిటిగేషన్ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక. ఇక్కడ ఇచ్చే తీర్పు అంతిమంగా వుంటుంది. ఈ తీర్పునకు వ్యతిరేకంగా ఏ న్యాయస్థానంలో అప్పీల్ చేయడానికి వీలుండదు. కోర్టుల్లో అనేక సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని కేసులు ఇరువర్గాల సమ్మతి మేరకు లోక్ అదాలత్ ద్వారా తక్షణమే పరిష్కారమవుతున్నాయి. కోర్టు చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా కక్షిదారులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

మూడు వేల కేసుల పరిష్కారానికి ఏర్పాట్లు

సంగారెడ్డి జిల్లాలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంగారెడ్డి, జోగిపేట, నారా యణఖేడ్, జహీరాబాద్ కోర్టుల్లో జరుపనున్నారు. 3 వేల కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవాధికార సంస్థ చర్యలు తీసుకుంది. క్రిమినల్ కాంపౌండేబుల్, సివిల్, ప్రిలిటిగేషన్, వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, సైబర్‌క్రైమ్, భూ సేకరణ, విద్యుత్ చౌర్యం కేసులు పరిష్కరించనున్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల వారికి సత్వర న్యాయం, సమన్యాయం అందుతుంది. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాం. రాజీమార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులకు వివరిస్తున్నాం.

-భవానీచంద్ర, సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి

సంగారెడ్డి రాంనగర్‌లోని తన ఇంటి వద్ద నెహ్రూ కుటుంబ త్యాగాలపై ప్రత్యేక కార్యక్రమాలు



రాహుల్ గాంధీ వేషధారణలో ఉన్న యువకుడితో జగ్గారెడ్డి



కుటుంబసభ్యులు, నెహ్రూ, ఇందిరాగాంధీ వేషధారణలతో ఉన్న వారితో జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన నెహ్రూ జయంతి వేడుకల్లో జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని రాంనగర్‌లోని తన ఇంటి వద్ద జగ్గారెడ్డి నేతృత్వంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నెహ్రూ కుటుంబ జీవిత విశేషాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రధాని పదవిలో నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చేసిన సేవలను గుర్తుచేశారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీల వేషధారణ ఆకట్టుకుంది. ప్రత్యేక ఆకర్షణగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అలరించింది.

తెల్లకార్డు లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ పథకం పక్కదారి పడుతోంది. గతంలో దొడ్డుబియ్యాన్ని అక్రమ రవాణా చేసిన తరహాలోనే సన్నబియ్యాన్ని సైతం దారి మళ్లిస్తున్నారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో వరుసగా పట్టుబడుతున్న రేషన్ బియ్యం నిల్వలే ఇందుకు నిదర్శనం. లబ్ధిదారులు, రేషన్‌డీలర్లు, మరోవైపు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వైపే వేళ్లన్నీ చూపిస్తున్నాయి. నిఘా పటిష్టం చేస్తేనే ఈ దందాను అరికట్టే అవకాశం ఉంది. లేదంటే సర్కారు లక్ష్యం నీరుగారి పోతుంది.



378 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ(ఫైల్)

సన్నబియ్యం పక్కదారి

దళారులకు విక్రయిస్తున్న తెల్లకార్డుదారులు

- ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్‌షాపుల నుంచీ మాయం
- ఉమ్మడి జిల్లాలో భారీ ఎత్తున పట్టుబడుతున్న వైనం
- కిలోకు రూ.15 నుంచి రూ.20 దాకా విక్రయం
- మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్‌కు రవాణా



మెదక్ మండలం రాజ్‌పల్లిలో పట్టుబడిన సన్నబియ్యం(ఫైల్)

సంగారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో సన్న బియ్యం కొనుగోలు చేయడానికి దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. ప్రధానంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సన్నబియ్యం కొనుగోలు చేస్తే రాష్ట్రం దాటించడానికి అనుకూలంగా ఉంటుందని దళారులు, వ్యాపారులు భావిస్తున్నారు. ఇక ఇతర జిల్లాల్లో కొనుగోలు చేసిన సన్నబియ్యాన్ని కూడా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే అక్రమంగా రవాణా చేస్తున్నారు.

సన్నబియ్యం తరలిస్తూ...

- మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామ సరిహద్దులోని మల్బరీ ఫామ్‌హౌస్‌లో అక్రమంగా నిల్వ చేసిన 22 సంచుల రేషన్ బియ్యాన్ని అక్టోబరు 23వ తేదీన పట్టుకున్నారు.
- ములుగు మండలంలో

మిగతా 7వ పేజీలో

213 క్వింటాళ్లు స్వాధీనం

మూడు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత

నర్సాపూర్/నారాయణఖేడ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం ఒకే రోజు మూడు చోట్ల 213 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వాహనాలలో తరలిస్తుండగా నర్సాపూర్, నారాయణఖేడ్‌లో, సిర్గాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచగా పట్టుకుని కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ నుంచి ఖేడ్‌కు నర్సాపూర్ మీదుగా బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు అధికారులు నర్సాపూర్‌లో మాటు వేశారు. శుక్రవారం తెల్లవారుజామున డీసీఎంను పట్టుకుని 165 క్వింటాళ్ల సన్న బియ్యంను స్థానిక గోదాంలో నిల్వ చేశారు. నిజాంపేట మండలం జంబికుంట జాతీయ రహదారి ఫ్లైఓవర్ సమీపం నుంచి బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఎస్ఐ శ్రీశైలం ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ర్యాలమడుగు మాణిక్ నాయక్ తండాకు చెందిన జయరాంను అదుపులోకి తీసుకుని, 40 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. సిర్గాపూర్ మండలం గౌడ్‌గాం జన్‌వాడ వద్ద కర్ణాటకకు చెందిన యాదుల్ ఓ గదిలో నిల్వ ఉంచిన ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆయా చోట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు.



నర్సాపూర్‌లో పట్టుకున్న డీసీఎం



కనిష్ట ఉష్ణోగ్రత వివరాలు...

సంగారెడ్డి జిల్లాలో : కోహీర్‌లో 7.8, న్యాల్‌కల్ 8.3, ఝురాసంగం 8.4, సదాశివపేటలో 8.4, అల్గోల్ 9.0, కంగ్టి 9.3, నల్లవల్లి 9.3, సత్వార్ 9.3, మొగుడంపల్లి 9.4, నిజాంపేటలో 9.9 డిగ్రీలు

మెదక్ జిల్లాలో : శివంపేటలో 9.0, రామాయంపేట 9.7, దామరంచ 9.7, డి.ధర్మారం 9.7, వెల్దుర్తి 9.8, నర్లపూర్ 9.9, కాగజ్ మద్దూరు 9.9, నాగపూర్ 9.9, సర్దన 9.9, వడ్డీ గ్రామంలో 9.9 డిగ్రీలు

సిద్దిపేట జిల్లాలో : పోతిరెడ్డిపేట 9.7, బేగంపేట్ 10.0 అబ్బీపూర్ 10.9, కొండపాక 10.3 గౌరారం 10.3, అంగడి కిష్టాపూర్ 10.3, దౌల్తాబాద్ 10.7 డిగ్రీలు

వణుకుతున్నారు..

రాష్ట్రంలోనే కోహీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత .. 7.8 డిగ్రీలు నమోదు

ఉమ్మడి జిల్లాలో 21 గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు..



కోహీర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో చలి గాలులతో ఉమ్మడి మెదక్ జిల్లా గజగజ వణికిపోతున్నది. సాధారణంగా డిసెంబరులో అధికంగా ఉండే చలి తీవ్రత ఈసారి నవంబరు నుంచే మొదలైంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో శుక్రవారం రాష్ట్రంలోని అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రికార్డుస్థాయిలో 7.8 డిగ్రీల కనిష్టానికి చేరుకున్నది. ఉదయం 9 గంటల వరకు శీతల గాలులు, దట్టమైన పొగమంచుతో కోహీర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొలం పనులకు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, పాలు, కూరగాయల వ్యాపారులు తీవ్రమైన చలిలో తమ దైనందిన కార్యకలాపాలను నిర్వర్తించాల్సి వస్తోంది. మధ్యాహ్నం సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25.0 డిగ్రీల వరకు నమోదవుతున్నప్పటికీ, రాత్రి, ఉదయం వేళల్లో సింగిల్ డిజిట్‌కు చేరుకుంటున్నాయి. శుక్రవారం కోహీర్‌తో పాటు పలు చోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. మెదక్ జిల్లా శివ్వంపేటలో, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని పోతిరెడ్డిపేటలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 21 గ్రామాల్లో పది కంటే తక్కువ డిగ్రీలు నమోదైంది. వాతావరణ శాఖ నిపుణుల అంచనాల ప్రకారం, రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయి చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.

వైద్య సేవల్లో అగ్రస్థానమే లక్ష్యం

- సంగారెడ్డి డీఎంహెచ్‌వో వసంతరావు



ఇంటర్వ్యూ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : వైద్య సేవల్లో సంగారెడ్డి జిల్లాకు అగ్రస్థానమే లక్ష్యమని డీఎంహెచ్‌వో డా. వసంతరావు తెలిపారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నాలుగేళ్ల తర్వాత రెగ్యులర్ డీఎంహెచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. తీసుకోబోతున్న చర్యలేమిటి?

గతంలో డీఎంహెచ్‌వోగా పనిచేసిన అనుభవం ఉన్నది. కేంద్ర, రాష్ట్ర వైద్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో రోగులకు అందేలా చర్యలు తీసుకుంటాను. సర్కారు వైద్యంపై నమ్మకం కలిగేలా అన్ని రకాల వైద్య చికిత్సలు, సేవలు గాడిన పెట్టేందుకు ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకుంటాను.

సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆరోపణలపై ఎలా స్పందిస్తారు?

పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సబ్‌సెంటర్, బస్తీదవాఖానా, వీపీ యూనిట్లతో పాటు డీఎంహెచ్‌వో పరిధిలోని అన్ని ఆఫీసుల సిబ్బంది, ఉద్యోగులు సమయపాలన పాటించాల్సిందే. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవు. ఆధార్‌బేస్డ్ అటెండెన్స్ విధానాన్ని అందరికీ అమలు చేసి సమయపాలనపై నిఘా ఉంచుతాం.

నిధుల పక్కదారిపై ఏం చేస్తారు?

ఆరోగ్య కార్యక్రమాల అమలుకు విడుదలయ్యే నిధుల విషయంలో పారదర్శకంగా ఖర్చు చేస్తాం. తప్పుడు బిల్లులతో పక్కదారి పట్టిస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

డెలివరీలు, కు.ని. ఆపరేషన్లకు చేపట్టే ప్రణాళిక ఏమిటి?

పీహెచ్‌సీ స్థాయిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా మెడికల్ ఆఫీసర్లను ఆదేశిస్తాం. కు.ని. ఆపరేషన్లు జరిగేలా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తాం.





ఘనపురం ఆనకట్టపై కవిత, నర్సాపూర్‌లోని ఓ స్కూల్‌లో పిల్లలతో ఎమ్మెల్సీ కవిత

రైతులకు అండగా ఉంటా

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

మెదక్/నర్సాపూర్/పాపన్నపేట/కౌడిపల్లి/కొల్చారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కాలువ, ట్రిబుల్ ఆర్ కింద భూములను కోల్పోతున్న రైతులకు అండగా ఉంటానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్, రెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి భూనిర్వాసితులతో సమావేశమయ్యారు. రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, వారికి జాగృతి అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మారినా రైతులకు, ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం 18వ ప్యాకేజీ పనుల విషయంలో న్యాయం జరగలేదని ఆమె ప్రశ్నించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులతో కేక్ కట్ చేసి సందడి చేశారు. మార్గమధ్యంలో కౌడిపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేసి, అద్దె భవనంలో పాఠశాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని హాస్టల్ విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని, ప్రభుత్వం వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం మెదక్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఏడుపాయల దుర్గామాత ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో శిలాఫలకాలకే పరిమితమైన ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనుల కోసం ప్రభుత్వం తక్షణమే రూ.30 కోట్లు మంజూరు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొల్చారం కేంద్రంగా కవి మల్లినాథ సూరి పేర సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని కవిత హామీ ఇచ్చారు. అలాగే, నాగ్సాన్‌పల్లిలోని వడ్డెర కాలనీలో పర్యటించి, పూరి గుడిసెలు, సమస్యలను తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో పలువురు నాయకులు, జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లో గుట్టుగా విచారణ

- జాతీయ స్థాయి రియల్ సంస్థల్లో వివరాల సేకరణ
- రోహింగ్యాల గాలింపునకు రంగంలోకి నిఘా వర్గాలు

7

బాలుడిని చితకబాదిన పిన తండ్రి

- మద్యం మత్తులో దారుణం
- రామాయంపేట మండలం అక్కన్నపేటలో ఘటన

లక్ష మెట్రిక్ టన్నులు కొన్నాం

- 25 వేల మంది రైతులకు రూ.84కోట్లు చెల్లించాం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కొనుగోలు కేంద్రంలో మెదక్ కలెక్టర్

రామాయంపేట, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్‌లో మెదక్ జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. 25 వేల మంది రైతులకు రూ.84 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. శుక్రవారం రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రబీ సీజన్ కన్నా ఈసారి అత్యధికంగా ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. 500పైగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు జరగకుండా చూశామన్నారు.

క్విజ్ పోటీలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయి

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థులకు బహుమతులు అందజేసిన సంగారెడ్డి కలెక్టర్

నారాయణఖేడ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : క్విజ్ పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింప చేస్తాయని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నారాయణఖేడ్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో విరూపాక్ష ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యక్ష ప్రశ్న' క్విజ్ పోటీల విజేతలకు శుక్రవారం ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్విజ్ పోటీ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని తెలిపారు. ప్రతీ విద్యార్థి రోజుకు 15 నిమిషాలు దినపత్రికలు చదివి, జనరల్ నాలెడ్జ్‌ను పెంచుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య, సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి ఖేడ్ శివార్లలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు.

దొంగతనాల కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

జగదేవ్‌పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దొంగకు ఆరు నెలల జైలు శిక్ష పడింది. ఈ ఏడాది మే, ఆగస్టు నెలల్లో తీగుల్, పీర్లపల్లి గ్రామాల్లో నాలుగు దొంగతనాలకు పాల్పడిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్ సౌన్వానిని జగదేవ్‌పూర్ పోలీసులు అరెస్టు చేసి, దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి సమగ్ర సాక్ష్యాధారాలు సేకరించి ఛార్జిషీట్ దాఖలు చేయగా, పూర్తి విచారణ అనంతరం గజ్వేల్ మెజిస్ట్రేట్ స్వాతి నిందితునికి ఆరు నెలల కఠిన కారాగార శిక్షను విధించారు. కేసును విజయవంతంగా నడిపిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నరేష్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చేగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నార్సింగ్ ఎస్‌ఐ సృజన స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి నార్సింగి-మిర్జాపల్లి ప్రధాన రహదారిపై ఓ గుర్తు తెలియన వ్యక్తి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ధాన్యం లోడుతో రివర్స్ వస్తున్న లారీ అతడిని ఢీకొనడంతో వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల నుజ్జునుజ్జు కావడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఘటనా స్థలంలో వ్యక్తి మృతదేహం, లారీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

యువతరంతోనే నవ సమాజ నిర్మాణం

● మెదక్ ఎంపీ రఘునందన్

మెదక్/మెదక్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువతరం ద్వారానే నవ సమాజ నిర్మాణం జరుగుతుందని, ప్రజాస్వామ్య దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మెదక్‌లో జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ ఏకతా దివస్ వేడుకల్లో భాగంగా, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ 565 సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేసిన పటేల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దేశ సమగ్రతను కాపాడేందుకు సామాజిక స్పృహ అలవర్చుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించి, ఏకతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం, జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ యువత గ్రంథాలయాలను ఉపయోగించుకుని తమ మేధస్సును, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. తాను రూ.5 లక్షల విలువ చేసే పుస్తకాలను గ్రంథాలయానికి అందించడానికి సిద్ధంగా ఉన్నానని, మెదక్ గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ లైబ్రెరీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ఉమ్మడి జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రంజిత్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రాల పేరుతో మోసం.. వ్యక్తి అరెస్ట్

సిద్దిపేట క్రైం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): బాణామతి మంత్రాలతో జబ్బులను నయం చేస్తానని అమాయక ప్రజలను మోసం చేసి డబ్బులు దండుకుంటున్న ఒక వ్యక్తిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేటలోని శంకర్‌నగర్‌కు చెందిన చాట్లపల్లి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాజయ్య అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఇందిరానగర్‌కు చెందిన ఎం.ఎన్. రహీముద్దీన్.. తన వద్ద అతీత మంత్ర శక్తులు ఉన్నాయని, ఎటువంటి బాధలనైనా తీరుస్తానని నమ్మబలికాడు. మాయమాటలు చెప్పి రాజయ్య వద్ద నుంచి రూ.45,000 వసూలు చేసిన రహీముద్దీన్ తన ఇంటికి తీసుకెళ్లి మంత్రాలు చదివినట్లు నటించి, జబ్బు నయం అవుతుందని చెప్పి పంపించాడు. అయినా రాజయ్యకు నయం కాకపోవడంతో తిరిగి వెళ్లి డబ్బు అడగగా నిజంగానే మంత్రాలు చేసి చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఈ నెల 12వ తేదీన సిద్దిపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం రహీముద్దీన్‌ను అతని ఇంటి వద్ద పట్టుకున్నారు. ఇంట్లో నుంచి బూడిద, కాగితపు చిట్టీలు, రంగురంగుల దారాలు, తావీజులు, పేపర్లు కట్టిన జెండాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తండ్రితో గొడవపడి యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దశంకరంపేట పట్టణ శివారులోని తిరుమలాపూర్‌లో చోటుచేసుకుంది. శుక్రవారం పెద్దశంకరంపేట ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన నీరుడి అనిల్ (29) గురువారం డబ్బుల విషయంలో తన తండ్రితో గొడవ పడ్డాడు. అనంతరం అనిల్ ఆవేశంలో బయటికెళ్లి తిరుమలాపూర్ చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానసికస్థితి సరిగాలేక మహిళ...



అమృత(ఫైల్)

తూప్రాన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేక ఓ మహిళ గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. తూప్రాన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణానికి చెందిన బుట్టి అమృత(52)కు కొంతకాలంగా మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. దీంతో ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు సంతోష్ గుర్తించి, అమృతను చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

● అత్యవసర వైద్యం అందించిన మెడికల్ కాలేజీ డిప్యూటీ సూపరింటెండెంట్

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎయిర్‌ఇండియా (ఏఐ 2449)లో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురికాగా, అదే విమానంలో ఉన్నా ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాల డిప్యూటీ సూపరింటెండెంట్ వైద్య సహాయం అందించారు. దీంతో ప్రయాణికుడు క్షేమంగా హైదరాబాద్ చేరారు. ఇందుకు సంబంధించి వివరాలు..గురువారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో సిలిగురికి చెందిన నితాయ్ భౌమిక్(68) ప్రయాణిస్తుండగా, ఆయనకు ఆకస్మికంగా తీవ్ర హైపర్‌వెంటిలేషన్ ఏర్పడి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విమాన సిబ్బంది కెప్టెన్ దృష్టికి తీసుకెళ్లగా, అయన ఇచ్చిన మెడికల్ అసిస్టెన్స్ కాల్‌కు అదే విమానంలో ఉన్న చిట్కూల్‌లోని మహేశ్వర మెడికల్ కళాశాల, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ పామర్తి స్పందించారు. ఆయన ముందుకు వచ్చి ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన వైద్య సహాయం అందించి, శ్వాసను స్థిరపరిచారు. వెంటనే స్పందించి వైద్య సహాయం అందడంతో ప్రయాణికుడు విమానం దిగే సమయానికి పూర్తి సురక్షిత స్థితికి చేరుకున్నారు. విమానం హైదరాబాద్ చేరగా, బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. సమయానికి వైద్యం అందించిన డాక్టర్ శ్రీనివాస్ పామర్తిని ఎయిర్‌ఇండియా సిబ్బందితో పాటు, ప్రయాణికులు ప్రశంసించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దుబ్బాక, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దుండగులు ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోతారం గ్రామానికి చెందిన జాల దేవరాజ్ గురువారం తన కుటుంబ సభ్యులతో బాసర దేవస్థానానికి దర్శనానికి వెళ్లారు. ఇదే అదునుగా గురువారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన దేవరాజుకు ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. ఏసీపీ రవీందర్, సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దేవరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 తులాల బంగారం, రూ.2.40 లక్షల నగదు చోరీకి గురైందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కీర్తి రాజు తెలిపారు.



చలికి రక్ష.. గిరాకీ లెస్స..

హుస్నాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చలికాలం వచ్చిందంటే మనకు గుర్తుకొచ్చేవి ఉన్ని దుస్తులే. చలి నుంచి తట్టుకోవడానికి స్వెటర్‌లు, మంకీ క్యాప్‌లు, జర్కిన్‌లు వినియోగిస్తాం. గత అయిదు రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరగడంతో వీటికి గిరాకీ పెరిగింది. గతంలో ఉన్ని దుస్తులు కొనుగోలు చేయాలంటే కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్ వంటి పెద్ద పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు చలికాలం రాగానే చిన్న పట్టణాలకు సైతం వచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై ప్రత్యేకంగా స్వెటర్ దుకాణాలు వెలుస్తున్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఈ దుకాణాలను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన సుమారు 30 మంది వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు. ఈ ఉన్ని దుస్తులను హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాల నుంచి తీసుకురానున్నట్లు వ్యాపారులు తెలిపారు. మాస్కులు, టోపీలు, శాలువాలు, గ్లౌజ్‌లు, మంకీక్యాపులు రకాలను బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు, జరికిన్‌లు, స్వెటర్లు, పెద్ద బ్లాంకెట్స్ రూ.400 నుంచి రూ.600వరకు విక్రయిస్తున్నారు. చిన్న బ్లాంకెట్స్ రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు.









మంత్రులతో కలసి సంబరాలు చేసుకుంటున్న నీలం మధు ముదిరాజ్

సీఎం రేవంత్ నాయకత్వాన్ని ప్రజలు స్వాగతించారు


- బీసీ బిడ్డ నవీన్‌యాదవ్‌ను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ తరహాలో ప్రజా పాలన అందిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు స్వాగతించారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ తెలిపారు. అందులో భాగంగానే జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో నీలం మధు పాల్గొన్నారు. అలాగే మంత్రులతో కలసి సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బిడ్డకి టికెట్ ఇచ్చి బీసీ వాదాన్ని బలపర్చిన ముఖ్యమంత్రి రేవంత్ నమ్మకాన్ని ప్రజలు నిలబెట్టారని సంతోషం వ్యక్తంచేశారు. యావత్ బీసీ లోకమంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి గెలుపులో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

బీసీ హాస్టల్ గోడలపై మారిన పేర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'బీసీ హాస్టల్‌లో గోడలపై ఇంకా పాత వారి 'పేర్లే' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతి లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సంగారెడ్డిలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్ సమీపంలోని బీసీ(బి) బాలుర కళాశాల వసతి గృహ ప్రవేశ ద్వారం ఫ్లెక్సీలో కలెక్టర్, ఉపరాష్ట్రపతి పాత పేర్ల స్థానంలో కొత్తవారి పేర్లను ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపించడంపై హాస్టల్ వార్డెన్‌పై సంబంధిత బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జగదీశ్ ఒకింత ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.



కొత్తవారి పేర్లతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

త్రిశూలం ఆకృతిలో కార్తీక దీపారాధన



వర్గల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం త్రిశూలం ఆకృతిలో కార్తీక దీపారాధన చేశారు. ఆలయ మండపంలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్యన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ముందు త్రిశూలం ఆకారంలో కార్తీక దీపాలు ఏర్పాటు చేయగా, భక్తులు వాటిని వెలిగించి దీపారాధన చేసి ఆలయ ప్రాంగణాన్ని ప్రకాశింపజేశారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఈవో విజయరామారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లో గుట్టుగా విచారణ

- జాతీయ స్థాయి రియల్ సంస్థల్లో వివరాల సేకరణ
- రోహింగ్యాల గాలింపునకు రంగంలోకి నిఘా వర్గాలు

పటాన్‌చెరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'పటాన్‌చెరులో రోహింగ్యాలు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో పోలీసులు పారిశ్రామిక వాడల్లో గుట్టుగా విచారణ చేపట్టారు. ఇప్పటికే నిఘా సంస్థలు రంగంలోకి దిగి వారు చేయాల్సిన విచారణ ఇప్పటికే చేపట్టినట్టు సమాచారం. ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. దీనిపై పోలీసులు రహస్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా హిందీ ఆధారిత పరిశ్రమల్లో పని చేస్తున్న వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి పారిశ్రామికవాడల్లో రసాయన పరిశ్రమలు ఉండటంతో నిఘావర్గాలు అప్రమత్తం అయ్యారు. తెల్లాపూర్ పురపాలక పరిధిలోని కొల్లూరు, ఉస్మాన్‌నగర్, ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామాల్లో పెద్దఎత్తున బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిల్లో పరిమితికి మించి కార్మికులు పని చేస్తున్నారు. వీరికి సంబంధించిన ఆధారాలు రికార్డుల్లో దొరికే పరిస్థితి లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. వందమందికి కావాల్సిన లైసెన్స్ తీసుకొని వెయ్యి మంది వరకు కార్మికులను ఇతర రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్‌లు తీసుకువస్తున్నట్టు ప్రాథమికంగా అధికారులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. చార్మినార్ జోన్‌కు చెందిన ఓ ఐజీ స్థాయి అధికారి వివరాల సేకరణపై దృష్టి సారించినట్టు తెలిసింది. పటాన్‌చెరు, పాశమైలారం, రుద్రారం పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులతో సమావేశమయినట్టు ప్రచారం జరుగుతోంది. పని చేస్తున్న ప్రతి ఒక్కరి వివరాలు కావాలంటూ అడిగినట్టు సమాచారం. రెవెన్యూ అధికారుల వ్యవహార శైలిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ విషయంలో పోలీస్ విచారణ జరుగుతున్నందున నివేదికను బట్టి శాఖాపరమైన చర్యలపై ఆలోచిద్దామని చెప్పినట్లు తెలిసింది.



పారిశ్రామిక వాడలోని కార్మికుల విగ్రహం

కాంట్రాక్టర్ల పాత్రపై ఆరా

గుత్తేదారుల వ్యవహారశైలిపై అధికారులు దృష్టి సారించారు. వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చే సమయంలో కార్మిక శాఖ కార్యాలయంలో వారిపేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ నిబంధనల మేరకు జరగడం లేదన్న దానిపై నిఘా అధికారులు దృష్టి సారించారు. రోహింగ్యాలకు సంబంధించిన వ్యవహారంలో కంపెనీలు ఇచ్చే జీతం సరిపోదు కాబట్టి పోషణ, వసతి, భార్యాపిల్లలకు పంపడం వంటి విషయాల్లో ఎవరు భరిస్తున్నారనే దానిపై స్పష్టత తెచ్చుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులతో పాటు ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ వంటి వర్గాలతో పాటు కేంద్రానికి సంబందించిన నిఘా సంస్థలు ఇప్పటికే పని చేస్తున్నట్టు అధికార వర్గాలు తెలుపుతున్నాయి.

బాలుడిని చితకబాదిన పిన తండ్రి

- మద్యం మత్తులో దారుణం

రామాయంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన పిన తండ్రి కొడుకును చితకబాదాడు. నాకు పుట్టలేదంటూ మద్యం మత్తులో అభం శుభం తెలియని లేత మనసును గాయపరిచాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేటకు చెందిన సత్యనారాయణ ఇదే జిల్లా మద్దుల్వాయి ప్రాంతానికి చెందిన శ్వేతను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే శ్వేతకు నాలు గేళ్ల బాలుడు(వంశీ) ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఇదే అదనుగా తనకు పుట్టని పిల్లవాడిని నేనెందుకు పోషించాలంటూ అక్కడే ఉన్న వంశీని ఓ బెల్టుతో విచక్షణారహితంగా వీపుపై కొట్టాడు. తీవ్ర గాయాలైన బాలుడికి తల్లి శ్వేత వైద్య చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అనంతరం బాలుడి రామాయంపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, బాలుడిని చితకబాదిన ఘటనపై రామాయంపేట ఎస్సై బాలరాజు ను వివరణ కోరగా.. తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.





అనాథాశ్రమ విద్యార్థులతో ఆహ్లాదంగా గీతం బీ స్కూల్ విద్యార్థులు

దాతృత్వ స్ఫూర్తిని చాటిన గీతం విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ విద్యార్థులు వినూత్నంగా నిర్వహించారు. 'జాయ్ ఆఫ్ గివింగ్' పేరిట నల్లగండ్లలోని 47 మంది శిశు మంగళ్ అనాథాశ్రమ విద్యార్థులను గీతం ప్రాంగణానికి ఆహ్వానించి, రోజంతా వారిలో ఉత్సాహాన్ని నింపారు. దయ, దాతృత్వ స్ఫూర్తిని చాటి, వారిలో కొంగొత్త ఆశలను రేకెత్తించారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారందరికీ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా పాల్గొని, విద్యార్థుల చొరవను ప్రశంసించారు.

ఉద్యాన రంగ అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నాం

- యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రాజిరెడ్డి



వర్మికంపోస్టు యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఛాన్స్‌లర్

ములుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ఉద్యాన రంగ అభివృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. ములుగులోని ఆ యూనివర్సిటీలో జరిగిన పలు కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విశ్వవిద్యాలయం సమగ్ర అభివృద్ధి, సమాజ సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతకు ఈ కార్యక్రమాలు నిదర్శనంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా ఆయన వర్మికంపోస్ట్ యూనిట్ ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, హార్టికల్చర్ డీన్ డాక్టర్ చీనానాయక్, డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సంగారెడ్డి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

కంది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికలు పోక్సో, జువైనల్ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని కేజీబీవీలో శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలల రక్షణ చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. చైల్డ్ లేబర్, సోషల్ మీడియా వాడకం, గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని విద్యపై దృష్టి పెట్టి, క్రమశిక్షణతో కష్టపడి చదివి విజయాన్ని సాధించాలని ప్రేరేపించారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. లలిత కుమారి మాట్లాడుతూ ప్రతి బాలిక తనలోని శక్తిని గుర్తించి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం సాహిత్య పోటీలతో పాటు చదువులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కంది మెడికల్ ఆఫీసర్ సాయి శంకర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి మీరాబాయి, డీసీపీయూ రత్నం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ యాదగిరి, జెండర్ స్పెషలిస్ట్ విశాల, ఏఎన్ఎం, స్కూల్ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వరి విత్తన ఘటనపై రేపు నిజనిర్ధారణ

మెదక్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) నకిలీ విత్తనాలతో పంట నష్టపోతున్న రైతుల అగచాట్లపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ ఆదివారం నిజనిర్ధారణ చేపట్టనుందని ఆ సంస్థ జిల్లా బాధ్యులు షేక్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేగుంట మండలం రుక్మాపూర్‌లో బీటీ వంగడాలతో అమాయకపు రైతులను బురిడీ కొట్టించిన విత్తన కంపెనీలను చట్టం ముందు నిలిపేందుకు గానూ కమిటీ సభ్యులు, మేధావులు నేరుగా బాధిత రైతులను కలవనున్నారని తెలిపారు. రైతుల మేలు కోరేవారు ఆ బృందంలో పాలుపంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సన్నబియ్యం పక్కదారి

(5వ పేజీ తరువాయి)

కిలో సన్నబియ్యాన్ని రూ.16కు దళారులు కొనుగోలు చేస్తున్నారు.

- సెప్టెంబరు19న రేగోడ్ మండలం పోచారం రహదారి వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు.
- రాజస్థాన్‌కు 450 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని కల్హేర్ మండలం మాసాన్‌పల్లి చౌరస్తాలో పోలీసులు పట్టుకున్నారు.
- అక్టోబరు 6న కామారెడ్డి జిల్లా పిట్లంకు బొలెరో వాహనంలో తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.
- రాయికోడ్ మండలంలో రూ.20 నుంచి రూ.22 చొప్పున చెల్లించి కిలో బియ్యాన్ని దళారులు కొంటున్నారు.
- కుకునూరుపల్లి మండలంలో మొదటి రెండు నెలలు పంపిణీ చేసిన సన్నబియ్యం బాగున్నాయని, ఇప్పుడు సరిగా ఉండట్లేదని లబ్దిదారులు రూ.18 నుండి రూ.25వరకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు.
- మనోహరబాద్ మండల కేంద్రంలోని అజయ్ కుమార్‌గౌడ్ రేషన్‌షాపులో కోటా కన్నా అదనంగా ఉన్న 19 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు జూన్‌లో పట్టుకున్నారు.
- వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో గత నెల 9న 35క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఈ మండలంలో దళారులు కొనుగోలు చేసిన బియ్యాన్ని రూ.25కు కిలో చొప్పున మిల్లర్లకు విక్రయిస్తున్నారు.
- అక్కరుపేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో ఇటీవల ఓ రైస్‌మిల్లులో 372 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు.
- అమీన్‌పూర్ పట్టణంలో రేషన్ బియ్యాన్ని రూ.20కి కిలోచొప్పున లబ్దిదారులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీరు బీపీటీ బియ్యంలో కలిపి రూ.60కి కిలో చొప్పున ప్రజలకు అమ్ముతూ మోసం చేస్తున్నారు.
- టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి శివారులో సెప్టెంబరు 22వ తేదీన 60 బస్తాలు, అక్టోబరు 13న 20క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు.
- నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో తాజాగా 43 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.
- మాసాయిపేట మండలంలో తెల్లకార్డుదారుల వద్ద సన్నబియ్యాన్ని దళారులు కొనుగోలు చేస్తున్నారు. చేగుంట మండలం వడియారంలోని మిల్లులకు తరలిస్తున్నారు.
- తూప్రాన్ పట్టణ పరిధిలోని కరీంగూడ వద్ద ఈనెల 12న 378.70 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని తరలిస్తున్న లారీని పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది.
- సంగారెడ్డి మండలంలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో నూకల శాతం ఎక్కువగా ఉంటున్నదనే ఆరోపణలు ఉన్నాయి.

రేషన్ షాపులు... గోదాముల్లోనే..

రేషన్ డీలర్ల వద్ద రూ.20కి కిలో చొప్పున డబ్బులు తీసుకొని చాలామంది లబ్దిదారులు సన్నబియ్యానికి ధర కడుతున్నారు. ఇవే బియ్యాన్ని మరుసటి నెల కోటాలో లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నారు. అయితే రేషన్‌షాపులకు బియ్యాన్ని తరలించే ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములు కేంద్రంగా అక్రమ దందా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డీలర్ సూచన మేరకు తమ షాపునకు రావాల్సిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే నిలిపివేస్తున్నట్లుగా సమాచారం. ఒక లారీలోడు కాగానే అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారని తెలుస్తోంది. ఫలితంగా ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వాహకులకు, రేషన్ డీలర్లకు కాసులు కురుస్తున్నట్లుగా చర్చ నడుస్తోంది. అయితే కొంత మంది డీలర్లు మాత్రమే ఈ అక్రమదందాలో ఉన్నారు. మిగితా చోట్ల సక్రమంగానే ఉంది.



నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

బియ్యం అమ్ముతారా అంటూ..

ప్రతీనెల 1వతేదీ నుంచి 18వ తేదీ వరకు రేషన్‌దుకాణాల్లో ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటారు. పంపిణీ చేస్తున్నారని తెలియగానే గ్రామాలు, పట్టణాల్లో దళారులు వాలిపోతున్నారు. కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు అందజేసి అక్కడికక్కడే కొంటున్నారు. గతంలో దొడ్డు బియ్యం కొనుగోలు చేసినవారే ఇప్పుడు సన్నబియ్యం కొంటున్నారు. కొందరు పంట బియ్యం తినేవాళ్లు, ఇంకొందరు నూకలు ఉన్నాయని వద్దనుకునేవారు ఈ దళారులకు విక్రయిస్తున్నారు. అందుకే మోటార్‌సైకిళ్లు, ట్రాలీ ఆటోలతో వచ్చి బహిరంగంగానే తూకం వేస్తున్నారు. ఉచితంగా వచ్చిన బియ్యానికి డబ్బులు వస్తుండడంతో తెల్లకార్డుదారులు సైతం ఎగబడి విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోళ్లు జరుపుతున్న విషయం పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్ వర్గాలకు తెలిసినా ప్రేక్షకపాత్రలోనే ఉంటున్నారు. ఏదైనా సమాచారం ఉన్నపుడు మాత్రం ఆటోలు, వ్యాన్లను స్వాధీనం చేసుకుంటున్నారు.

నిఘా లేకనే...

ఈ దందాను క్షేత్రస్థాయిలో నియంత్రించడంలో అధికారులు, నిఘా వర్గాలు విఫలమవుతున్నారు. రేషన్ దుకాణాల వారీగా సివిల్ సప్లయ్ అధికారుల నిఘా కొరవడింది. బియ్యం పంపిణీ తర్వాత గ్రామాల్లో దళారుల అరుపులపై అడ్డుకట్ట వేసేవాళ్లు లేకపోయారు. రేషన్ షాపులను మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ షరా 'మామూలే' అన్నట్లుగా ఉంటున్నారు. బియ్యం నిల్వలపై కూడా ఆరా తీయడం లేదు. బియ్యం విక్రయించే వారిపైనా దృష్టిపెట్టడంలో లోటుపాట్లు కనిపిస్తున్నాయి. ఫలితంగానే కిలోల కొద్దీ సేకరించిన బియ్యం టన్నుల దాకా తయారై జిల్లా సరిహద్దులను యథేచ్ఛగా దాటుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులు విస్తరించిన బొడ్మట్‌పల్లి, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సి ఉంది.

సంక్షిప్తం

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి: ఆర్డీవో

అల్లాదుర్గం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మెదక్ ఆర్డీవో అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, వాహనాలకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటిక్ డే

జోగిపేట రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిల్డ్రన్స్ డే, డయాబెటిస్ కార్యక్రమాలు నిర్వహించారు. అందోల్ అంగన్‌వాడీ కేంద్రంలో 20మంది విద్యార్థులకు ఫ్రూట్ జ్యూస్, స్లేట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం డయాబెటిక్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక విశ్రాంతి భవనంలో రిటైర్డ్ ఉద్యోగులు 51మంది షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

ఖేడ్‌లో ఉచిత మధుమేహ పరీక్షలు

నారాయణఖేడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటిస్‌డేను పురస్కరించుకొని శుక్రవారం ఖేడ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్లోబల్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఉచిత మధుమేహ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది దాదాపు 100 మందికి సంబంధించిన రక్తనమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సాయిసంగమేశ్వర్, సభ్యులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీలో డీఎల్పీవో తనిఖీ

వట్‌పల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామపంచాయతీని డీఎల్పీవో అనిత తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్మికుల వేతనాలో కోత విధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు అనంతరం మండలంలోని దేవనూర్‌లో మురికి కాల్వలను, డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కాళ్లకల్ గ్రామానికి వైకుంఠ రథం అందజేత

మనోహరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన వర్గంటి మల్లారెడ్డి తన తండ్రి వర్గంటి కిష్టారెడ్డి స్మారకార్థం కాళ్లకల్ గ్రామం కోసం వైకుంఠ రథం వాహనాన్ని ఉచితంగా అందజేవారు. అంతేకాకుండా ఉచితంగా వైకుంఠ రథం కోసం ఒక నూతన మొబైల్ కొనుగోలు చేసి గ్రామకార్యదర్శికి ప్రియాంకకి బహూకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి గ్రామస్థులతో కలిసి మాల్లారెడ్డిని సన్మానించారు.

నేటి నుంచి జాడు చలావ్ యాత్ర

సంగారెడ్డి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఈ నెల 15వ తేదీ నుంచి చేపట్టిన జాడు చలావ్ యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉమారాణి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ యాత్ర శనివారం ఉదయం సంగారెడ్డిలోని సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమై హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వరకు సాగుతుందని తెలిపారు.

సంగారెడ్డి సీఐగా రామునాయుడు

సంగారెడ్డి క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాము నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కందిలోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేసిన ఆయన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ రమేష్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

బిహార్‌లో గెలుపుపై సంబరాలు

జహీరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో బీజేపీ కూటమి గెలుపు పట్ల శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లను పంచుకున్నారు.

● **చిన్నశంకరంపేట:** బీహార్‌లో బీజేపీ ఘన విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, జిల్లా నాయకులు సురేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, దశరథం, రాజు, నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో వివిధ వేషధారణలో చిన్నారులతో ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి తదితరులు



తూప్రాన్ లోని గీతాస్కూల్‌లో నెహ్రూ వేషధారణలో చిన్నారులు

అలరించిన బాలల దినోత్సవం

దివంగత మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీలలో నెహ్రూచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో బాలల దినోత్సవంతో సందడి చేశారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు14(ఆంధ్రజ్యోతి)



జిన్నారం మండలం వావిలాల ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య యోధుల వేషధారణలో చిన్నారులు



నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలలో చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్



మనోహరాబాద్: కాళ్లకల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



పెద్దశంకరంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన జరుపుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి: పీఆర్టీయూ

మెదక్‌అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నుంచి ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇచ్చేలా కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును పీఆర్టీయూ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్ రావు ఆధ్వర్యంలో ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. టెట్ మినహాయింపు కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఎంపీని కోరారు. ఎంపీ స్పందిస్తూ.. వచ్చేనెల 1 నుంచి 19 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర మాన వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో టెట్ విషయంపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేసేవరకు పోరాటం ఆగదు

సంగారెడ్డి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహింపు ఇవ్వాలన్నారు. ఆమోదయోగ్యమైన పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాయితేజ, ఆడిట్ కమిటీ కన్వీనర్ చందర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

రాఘవాపూర్ చౌరస్తాలో రెస్టారెంట్ సీజ్

సిద్దిపేట రూరల్,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో అక్రమంగా మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న వెంకటసాయి రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్లు సిద్దిపేట రూరల్ ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం వెంకటసాయి రెస్టారెంట్‌పై దాడి చేసి పట్టుకుని మద్యం తాగుతున్న వారి పై, యజమాని రంగయ్య పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి బోయిని యాదగిరి, గ్రామ పరిపాలన అధికారి రజిత రెస్టారెంట్‌ను సీజ్ చేసి నోటీసులు అందజేశామన్నారు.

అర్హులందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు



మిర్జాపల్లి తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

చిన్నశంకరంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నోచుకోలేదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు పైలెట్ గ్రామంగా ఎంపికైన మిర్జాపల్లి తండాలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం మిర్జాపల్లి, గజగట్లపల్లి గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం వంద శాతం రాయితీపై ఇచ్చిన చేప పిల్లలను చెరువులలో వదిలారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, ఎంపీడీవో దామోదర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘనవిజయాన్ని పురస్కరించుకుని మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలను చూసి జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డిలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంజయ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు, పోటీ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు గ్రంథాలయాలను చక్కగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రచయిత రాజశేఖర్‌రెడ్డి రచించిన పర్సనాలిటీ డెవలెప్‌మెంట్ పుస్తకాన్ని గ్రంథాలయానికి బహూకరించారు.

లైబ్రరీ పుస్తకాలను చదవండి

మునిపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీలో ఉండే పుస్తకాలను విద్యార్థులు చదివి జ్ఞానాన్ని పొందాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం తుకారాం, ఎంఎన్‌వో భాస్కర్ రావు పేర్కొన్నారు. రూం టు రీడ్ కార్యక్రమంలో భాగంగా సంస్థ నుంచి ఐఎంసీ, ఆర్ట్ కాంటెస్ట్ బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు చిన్నారుల నాటక ప్రదర్శన అందరినీఆకట్టుకుంది.



చేగుంట శివ పార్వతి కల్యాణంలో మాధవానంద సరస్వతి స్వామి

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

చేగుంట నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు శుక్రవారం చేగుంట మండలం కర్నాల్‌పల్లి శ్రీసాయిబాబా అభయాంజనేయ ఆలయంలో కార్తీక మాసంను పురస్కరించుకొని ఆలయకమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి మాట్లాడుతూ.. లోక కల్యాణార్థమే కార్తీక మాసంలో శివపార్వతుల కల్యాణం జరుపుతున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయం ఆవరణలో నూతనంగా భోజన సత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బచ్చు రమేష్, సభ్యులు యాదిరెడ్డి బాల్రెడ్డి తుమ్మ శ్రీనివాస్, నాగలింగం, చింతల రమేష్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తీరిన తాగునీటి కష్టాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోహీర్, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 169 మంది విద్యార్థులు గత 8 నెలలుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే సమస్యకు సంబంధించి 'విద్యార్థులకు తాగునీటి కష్టాలు' అనే శీర్షికన ఈ నెల 14న ప్రచురితమైన కథనానికి బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన దాత నరేష్ దేశ్‌పాండే స్పందించాడు. ఈ మేరకు సొంత డబ్బు వెచ్చించి బోర్‌కు అవసరమైన మరమ్మతులు చేయించి కొత్త మోటార్‌ను బిగించి నీటి సమస్యను తీర్చాడు. సొంత గ్రామంలో పాఠశాల విద్యార్థులకు నీటి సమస్యను తీర్చాలనే లక్ష్యంతో ముందుకు వచ్చి సమస్యను తీర్చిన నరేష్ దేశ్‌పాండేను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

17న మాస్టర్ అథ్లెటిక్స్‌లో జిల్లాస్థాయి పోటీలు

మెదక్ అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఈ సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు. 35 నుంచి 95 ఏళ్లలోపు పురుషులు, మహిళలకు రన్స్, జంప్స్, త్రోస్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారికి వచ్చే నెల 13, 14 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగితా వివరాలకు ఫోన్ 9963005540, 9849263246 నెంబర్లను సంప్రదించాలన్నారు.

17న ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

మెదక్ అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి డా.ప్రభు తెలిపారు. అండర్-19 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలన్నారు. మిగితా వివరాలకు ఫోన్ 9440490622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: డీఎస్పీ



క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఐడీఎల్ స్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహించగా, డీఎస్పీ నరేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తూప్రాన్ ఎస్‌ఐ శివానందం, కరస్పాండెంట్ స్వరూప్‌రెడ్డి, డైరెక్టర్ రిషబ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రజనీ పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వెల్దుర్తి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వెల్దుర్తి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కౌన్సిలర్ స్వామి యాంటీ డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్, మెంటల్ హెల్త్, ఫిజికల్ హెల్త్, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామ పరిధి సాయిప్రియకాలనీలో నివాసముంటున్న రమేష్(43) కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నారు. భార్యాపిల్లలు ఇంట్లో లేకపోవడంతో మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమ ఇసుక నిల్వ లు సీజ్



నార్సింగ్‌లో ఇసుక అక్రమ డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

చేగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ గ్రేసీబాయి పేర్కొన్నారు. నార్సింగ్ వ్యవసాయ పొలాల్లో సుమారు 15 ట్రాక్టర్ల ఇసుక డంపు అక్రమంగా నిల్వ ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు కలిసి ఇసుక సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి



రాయికోడ్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కృష్ణవేణి

రాయికోడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి పేర్కొన్నారు. శుక్రవారం రాయికోడ్‌లోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇందిరా క్రాంతి వీవోఏ, వీవో, వోబీ అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికీ కొన్ని గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు నిరక్షరాస్యులుగా ఉండడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సదస్సులో ఏపీఎం బాలక్రిష్ణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీలు

నిజాంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో చిన్నతనంలోనే వివాహాలు చేస్తున్నారని సీడీపీవో స్వరూప రాణి, ప్రత్యేక అధికారి దేవకుమార్ పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ముందుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు అంగన్‌వాడీలతో బాల్య వివాహ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ బాలల హక్కు పరిరక్షణ మన అందరి బాధ్యత అని, బాలల హక్కులను సంపూర్ణంగా పరిరక్షించే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రాజేష్, ఎంఈవో, అంగన్‌వాడీ, ఆశాలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన ఆక్రమణలు తొలగించాలని కోరారు. పనులకంటే ముందుగా జలమండలి అధికారులు నీటి పైపులైన్ల వ్యవస్థపై మార్పులు చేర్పులు ముందే పూర్తిచేసుకోవాలని కోరారు. వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణ చేయని ఆటోలపై చర్యలు

పటాన్‌చెరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించని ఆటోవాలాలపై చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి ఆల్విన్‌కాలనీలో పర్యటించారు. స్థానికంగా పేరుకుపోయి వ్యర్థాలను పరిశీలించారు. ఆటోవాలాలు పూర్తిగా రావడం లేదంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. అనంతరం మురుగు పైపులైన్ పనులను పర్యవేక్షణ జరిపారు. ఆయనతో పాటు కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ వార్డు కమిటీసభ్యుడు నవీన్‌రెడ్డిలున్నారు. అనంతరం జిల్లా పరిషత్తు పాఠశాలలో విద్యార్థులకు ఆటల పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు భరత్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, సుధాకర్, పద్మజ తదితరులు ఉన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్ల సేకరణ మాసోత్సవం

మనోహరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో డిపాజిట్ల సేకరణ మాసోత్సవం నిర్వహించారు. ఈ మేరకు మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ గ్రామంలోని డీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్ల సంబురాలు నిర్వహించారు. ఈ బ్యాంక్ ద్వారా కల్పించే వ్యవసాయ, వ్యవసాయేతర ఋణాలు, ఇతర అన్ని రకాల రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాళ్లకల్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ కోరారు. ఇందులో 444 రోజులు ఫిక్స్‌డ్ డిపాజిట్ పై అత్యధిక వడ్డీ రుణాలు ఇస్తారన్నారు. నూతన అకౌంట్ వారికి 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీరేటు ఇస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

చిన్నశంకరంపేట/చేగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నశంకరంపేట సహకార సంఘం వద్ద చైర్మన్ అంజిరెడ్డి, జంగరాయి సహకార సంఘం వద్ద ఈవో బాలకిష్టయ్య, మడూర్ సహకార సంఘం వద్ద ఈవో కృష్ణ, చందంపేట సహకార సంఘం వద్ద చైర్మన్ సత్యనారాయణ సహకార జెండాలను ఎగరవేశారు. చేగుంట సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ అయిత రఘురాములు, రెడ్డిపల్లి సొసైటీ కార్యాలయం వద్ద మేకల పరమేష్‌లు జెండా ఆవిష్కరించి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతుల పంటలకు సంబంధం లేకుండా పంట రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ పరిశ్రమలకు చేయూత

రామాయంపేట, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు తమ బ్యాంకులు తక్కువ వడ్డీతో భారీగా రుణాలు ఇస్తోందని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ బిశ్రీనివాస్ పేర్కొన్నారు. రామాయంపేట బ్రాంచ్ నేతృత్వంలో గురువారం రాత్రి పరిశ్రమల ఖాతాదారులతో ఆయన సమావేశం అయ్యారు. బ్యాంకు స్థాపించి 107 ఏళ్లు అయిన సందర్భంగా అగ్రి ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ లోన్ ప్రాసెసింగ్ హెడ్ తన్వీర్ ఆలం, రామాయంపేట బ్రాంచ్ మేనేజర్ సుందర్ ప్రకాష్ మాట్లాడుతూ రైస్ మిల్లులు, పౌల్ట్రీస్, పాడి పరిశ్రమలకు రూ.50 లక్షల నుంచి 100 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు.

నాగాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగారెడ్డి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ పాలక మండలి సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ రాంగోపాల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబురాలు



పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నార్సింగిలో కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆ పార్టీ శ్రేణుల సంబురాలు మిన్నంటాయి. ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లలో పార్టీ కార్యకర్తలు, నాయకులు బాణసంచా పేలుస్తూ సందడి చేశారు. పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, అందువల్లే ఘన విజయం సాధించామన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)



జహీరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల విజయోత్సవం



మనోహరాబాద్: కాళ్లకల్‌లో సంబురాలు